# విషజ్వరాలతో తలడిల్లుతున్నరు

- విలీన గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, ఆగస్టు 31: విలీన గ్రామాలతోపాటు పట్టణంలో ప్రజలు విషజ్వరాలతో సతమతవుతున్నారని.. తక్షణమే పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎజెండా అంశాలను వివరించిన అనంతరం మూడో వార్డు కౌన్సిలర్ నిమశెట్టి విజయ్ మాట్లాడుతూ, విలీన గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. పదో వార్డు కౌన్సిలర్ సిరిగిరి రామ్ చందర్ మాట్లాడుతూ, వార్డులో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రం నిర్వహణ ఇప్పటికీ ప్రైవేట్ వ్యక్తుల చేతిలోనే ఉందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేలా చూడాలని కోరారు. 27వ వార్డు కౌన్సిలర్ గోలి మహేశ్ మాట్లాడుతూ, వరద నీరు మొత్తం భగవంతరావునగర్ కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు చేరుతోందన్నారు. దీంతో కాలనీవాసులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ, మున్సిపల్‌లో ప్రబలుతున్న జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసి, పరిశుభ్రత చేపట్టాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి ₹6లక్షలు కేటాయించామని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, డీఈ తిరుపతి, టీపీవో అన్సారి, ఏఈ నర్మద, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు రెండుబిడ్డల జయ, మారం కుమార్, నీలం కళ్యాణి, జోగిని శంకర్, కందుల శ్రీలత, సిరిగిరి రామ్‌చందర్, గడ్డమీది లావణ్య, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, అరం ఉమారాణి, ముప్పిడి సునంద మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై పట్టింపేది

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: విద్యార్థుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు కరువైందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టడం బాధాకరమన్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కిన పరిస్థితి రావడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మంచి భోజనం పెట్టాలని అడిగిన విద్యార్థుల కళ్లలో కారం కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యాశాఖలో మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మట్టె శ్రీనివాస్, వెంకటేశ్, సాయి, శ్రీనివాస్, కరుణాకర్, అరవింద్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి భూమిపూజ

గోదాము నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

వేములవాడ రూరల్, ఆగస్టు 31: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం మారుపాక, మల్లారం, నూకలమర్రి గ్రామాల్లో వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాములకు చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డితో కలిసి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, రైతన్నకు అండగా ఉంటూ సరైన సమయంలో విత్తనాలు, ఎరువులను అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులందరికీ తప్పనిసరిగా రుణమాఫీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ తూం కాంతారావు, డైరెక్టర్లు సంజీవరెడ్డి, మల్లేశం, రాజయ్య, రాజు, సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, నాయకులు బూర వజ్రమ్మ, బూర బాబు, రంగు వెంకటేశ్‌గౌడ్, ముడికే చంద్రశేఖర్, స్వయంప్రభ, వీరారెడ్డి, తిరుపతి, స్వామి, శేఖర్, రాజు, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

మిడ్‌మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరోసాఇచ్చారు. శనివారం వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో మిడ్‌మానేరు ముంపు గ్రామాల (ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కోడుముంజ, అనుపురం, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, చీర్లవంచ, గుర్రవాణిపల్లి) నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ప్రభుత్వ విప్ సమావేశానికి హాజరయ్యారు. గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇండ్లకు పరిహారం, పట్టాలు, 18ఏండ్లు నిండిన వారికి పరిహారం రాలేదని బాధితులు వివరించారు. గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నివారించాలని కోరారు. గ్రామాల పరిధిలో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. మానవతా దృక్పథంతో అందరి సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ రమేశ్, నిర్వాసితులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం

వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సంకెపల్లి శివప్రసాద్ పదవి విరమణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం శివప్రసాద్‌ను సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

# అంతిమ సంస్కారాలకు రుసుం ₹101 మాత్రమే

- సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- వెల్లడించిన చైర్‌పర్సన్ జిందం కళ

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వైకుంఠధామాల్లో అంత్యక్రియల నిర్వహణకు ₹101మాత్రమే తీసుకోవాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసినట్లు చైర్‌పర్సన్ జిందం కళ ప్రకటించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో పాలకవర్గ సభ్యుల సాధారణ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాలకవర్గం ఆమోదం తెలిపిన అజెండా అంశాలను చైర్‌పర్సన్ వెల్లడించారు. మొత్తం 19అంశాలతో కూడిన అజెండాకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. రాబోయే వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల పట్టణంలోని వైకుంఠధామాల్లో అంత్యక్రియల నిర్వహణకు ఇప్పటి వరకు ₹7,500 రుసుము చెల్లించాల్సి ఉండేదని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ₹101 రుసుముతో అంత్యక్రియలు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం నేటి నుంచే అమలులోకి వస్తుందని చెప్పారు. వైకుంఠరథం, తదితర నిర్వహణకు అదనపు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి సహకరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం ₹32లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శాఖల వారీగా విచారణ

- ఆందోళనలో రాజన్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ, ఆగస్టు 31: రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీల వ్యవహారం ఇప్పటికే దేవాదాయశాఖను కుదిపివేసింది. ప్రధానంగా పలు శాఖల్లో అవకతవకలను గుర్తించిన అధికారులు ఒక్కో విభాగంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన రికార్డులను తీసుకురావాలని ఆలయ అధికాలను ఆదేశించగా, నివేదికలు తయారు చేసేందుకు నిమగ్నమయ్యారు. అధికారుల పర్యవేక్షణతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

### విభాగాల సమాచారం కావాలని ఆదేశం

ఆగస్టు 22న 20మంది బృందంతో కూడిన ఏసీబీ అధికారులు 12గంటలపాటు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. రెండో రోజు కూడా నాలుగు గంటలపాటు రికార్డులను పరిశీలించారు. గోదాముల్లో సరుకుల నిల్వలు వ్యత్యాసం, కల్యాణకట్టలో భక్తుల నుంచి బలవంతంగా నగదు వసూలు, ఆమోదం లేకుండానే కొనుగోలు, టెండర్లను గుర్తించినట్లుగా సామాజికమాధ్యం ఎక్స్ ద్వారా ఏసీబీ వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే గోదాముల్లో సరుకుల వ్యత్యాసానికి సంబంధించి ఏడాది రికార్డులను తీసుకురావాలని ఏసీబీ అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. పది రోజుల వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు.. ఏడాదికి సంబంధించిన వివరాలు సైతం అడగడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.

## జిల్లాలో భారీ వర్షం

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: జిల్లాలో శనివారం వర్షం దంచికొట్టింది. సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు ఏకధాటిగా కురిసింది. చందుర్తి, కోనరావుపేట, మండలాల్లో భారీ వర్షం పడగా, మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు పడింది. కాగా, సిరిసిల్ల పట్టణంలో వర్షానికి సంజీవయ్యనగర్, నేతన్న చౌరస్తా, మెయిన్ బజార్, అశోక్‌నగర్, ప్రగతినగర్ వార్డులు జలమయమయ్యాయి.

### అవసరమైతే తప్ప బయటికి రావద్దు: ఎస్పీ

తెలంగాణ చౌక్, ఆగస్టు 31: భారీ వర్షాల దృష్యా అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ప్రకటన ద్వారా సూచించారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100కి కాల్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీం జిల్లాలో 24గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. మానేర పరివాహక ప్రాంతాల ప్రజలు చేపల వేటకుగాని, చెరువులు, ప్రాజెక్టల వద్దకు వెళ్లకూడదని సూచించారు.

## వరి నేరుగా విత్తే పద్ధతిపై అవగాహన

ఇల్లంతకుంట, ఆగస్టు 31: వరి నేరుగా విత్తుకునే పద్ధతిపై కరీంనగర్ ఏరువాక పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి శనివారం పొత్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఓ రైతు సాగు చేస్తున్న పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, మాట్లాడారు. నాటేన వరిలో మొదటి 30 రోజులు, నేరుగా విత్తుకున్న వరిలో 45రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. పైరులో గడ్డి నివారణకు లీటర్ మందును నాటేసిన లేదా విత్తనాలు చల్లిన మూడు నుంచి ఐదు రోజుల్లోపు ప్రెటిలాక్లోర్ (600-800 మిల్లీలీటర్లు) లేదా పైరజోల్స్యూరాన్ ఈథైల్ 80 గ్రాముల మందును చల్లాలని సూచించారు. కలుపు నివారణ, సస్య రక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ఇక్కడ ఏఈవో లలిత, రావెస్ విద్యార్థులు, రైతులు ఉన్నారు.

## చిరిగిన ఫ్లెక్సీ.. తప్పిన ప్రమాదం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌కు ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుకు ఉన్న ఫ్లెక్సీ చిరిగి ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై పడడంతో మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే సెస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని ఫ్లెక్సీని తొలగించడంతో ప్రమాదం తప్పింది. మున్సిపల్ కాంప్లెక్స్ గోడకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గాలి వీచినప్పుడల్లా ప్రమాదానికి కారణం అవుతున్నాయని, మరోసారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: శివనగర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ మధుకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్, వెంకట్రావునగర్, సాయినగర్, సుభాష్‌నగర్, విద్యానగర్, ఆదర్శనగర్, గోపాల్‌నగర్, బీవైనగర్, గణేశ్‌నగర్, కొత్త బస్టాండ్, శివనగర్, ఇందిరానగర్, బాబానగర్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ తొలగిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 'మోడల్'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 31: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని మోడల్ స్కూల్‌లో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ ఆగస్టు 31: మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్ఐ గణేశ్, ప్రిన్సిపాల్ ముదురుకోల రాజు పిలుపునిచ్చారు.

## మరో రెండు జీపీల ఏర్పాటుకు కసరత్తు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31: మండలంలో మరో రెండు నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు దిశగా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇటీవలే నూతన పంచాయతీలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. మండలంలో 24 గ్రామాలు ఉండగా, మరో రెండు పంచాయతీలు ఏర్పడే అవకాశం ఉన్నది. తిమ్మాపూర్‌ను ఆనుకుని ఉన్న తిమ్మాపూర్ తండా, బొంగులకింది తండా కలిపి జై సేవాలాల్ తండాగా, తిమ్మాపూర్-బాకుర్‌పల్లిని ఆనుకుని ఉన్న బాకుర్‌పల్లి (బాకుర్‌పల్లి తండా కాకుండా)ని మరో గ్రామ పంచాయతీగా ఏర్పాటు కానున్నది. త్వరలోనే పంచాయతీ నోటిఫికేషన్ రానున్న తరుణంలో ఆయా గ్రామాలు, తండావాసులు అంచనాలు వేసుకుంటున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 31: 2024-25 సంవత్సరానికి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 5వ తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 5వ తరగతికి 49సీట్లు కేటాయించామని, హాస్టల్ వసతి కూడా ఉందన్నారు. ఈ నెల 16లోగా కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. 24న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంభీరావుపేట, ఆగస్టు 31: పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్‌గౌడ్ శనివారం పరిశీలించారు. రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా రాజుపేట, శ్రీగాధ, ముచ్చర్ల, హీరాలాల్‌తండా పాఠశాలలను సందర్శించారు. కరెంట్, తాగునీరు, మూత్రశాలలు, ర్యాంప్ తదితర వసతులను హెచ్ఎంలతో కలిసి పరిశీలించారు.

## శేషజీవితం సంతోషంగా గడపాలి

తెలంగాణ చౌక్, ఆగస్టు 31: శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో పోలీస్‌శాఖలో 34 ఏండ్ల సుదీర్ఘకాలం పాటు సేవలందించిన ఏఎస్ఐ చీటి సంజీవరావును పదవి విరమణ పొందగాశనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

## కార్పొరేషన్ రుణాలపై ఆరా

ముస్తాబాద్ ఆగస్టు 31: 2021-22లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలను లబ్ధిదారులకు ఇవ్వడంలో జరిగిన జాప్యంపై ఈడీ స్వప్న శనివారం వివరాలు సేకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్‌తో కలిసి బ్యాంకర్లు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు రుణాలు తీసుకోలేదా.. బ్యాంకర్లు ద్వారా ఏదైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరా తీశారు. ఇక్కడ ఎంపీడీవో రాజేందర్, బ్యాంక్ ఎల్‌డీఎం మల్లి ఖార్జున్, ఎంపీవో బీరయ్య, బ్యాంక్ మేనేజర్లు ఉన్నారు.

## అటవీపై కొడ్డలి వేటు

వీర్నపల్లి, ఆగస్టు31: అటవీ భూముల సంరక్షణకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. దుండగులు గొడ్డలివేటుకు చెట్లు నేలకూలుతున్నాయి. తాజాగా కంచర్ల శివారులోని లచ్చక్కగుడ్డం ప్రాంతంలో దుండగులు రాత్రి వేళల్లో విలువైన టేకు చెట్లను నరికివేశారు. అక్కడే దుంగలుగా మార్చి తరలించగా, మరికొన్ని అక్కడే వదిలివేశారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో టేకు చెట్లను ధ్వంసం చేసి.. అటవీ భూమిని సాగు చేయడానికి ప్రయత్నించారు. అధికారులు స్పందించి అటవీ సంపదను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎరువుల విక్రయాల్లో అక్రమాలు

వేములవాడ రూరల్, ఆగస్టు 31: ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా మార్క్‌ఫెడ్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్ రమేశ్ తన భార్య పేరుతో డీసీఎంఎస్ కోసం లైసెన్స్ తీసుకున్నాడు. ఎరువుల కోసం మార్క్‌ఫెడ్‌కు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే అకౌంటెంట్ భాస్కర్ సాయంతో నగదు చెల్లించినట్లు.. బకాయిలు ఏమిలేనట్లు రమేశ్ స్టేట్‌మెంట్ తయారు చేసి డిస్ట్రిక్ట్ మేనేజర్ దివ్య భారతికి చూపించాడు. ఈ క్రమంలో 2022 నుంచి 2024 వరకు సుమారు ₹76.77లక్షల విలువైన ఎరువులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. దీంతో నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించిన అధికారులు తిరిగి నగదు చెల్లించాలని కోరగా, వారు స్పందించలేదు. అకౌంట్స్ ఆఫీసర్ మమత ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి కేసు నమోదు చేశారు. డిస్ట్రిక్ మేనేజర్ దివ్య భారతితోపాటు రమేశ్, భాస్కర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అలాగే ఎరువుల విక్రయాల్లో దుర్వినియోగానికి పాల్పడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రమేశ్, భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

గంభీరావుపేట, ఆగస్టు 31: వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘ భవనంలో శనివారం మండల వినాయక మండపాల నిర్వాహకుల తో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఎస్పీ హాజరయ్యారు. అనుమతి లేకుండా ఎవరైనా డీజేలు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రామ్మోహన్, నిర్వాహకులు, యూత్ సభ్యులు ఉన్నారు.

## క్రీడల్లోనూ రాణించాలి

బోయినపల్లి, ఆగస్టు 31: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఇన్‌చార్జి ఎంతవో శ్రీనివాస్ సూచించారు. నర్సింగాపూర్ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో విజేతలకు శనివారం ఆయన బహుమతులు అందించారు. మండల స్థాయిలో రాణించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ జిల్లా క్రీడాధికారి శ్రీనివాసరెడ్డి, మండల క్రీడాధికారి మధుకర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు ఉన్నారు.

## 'పాక్సో యాక్ట్'పై అవగాహన

వీర్నపల్లి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు పాక్సో యాక్ట్‌పై ఎస్ఐ ఎల్లాగౌడ్ శనివారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న బాలికలు డయల్ 100 లేదా 1098 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఆనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

## కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 31: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ వరద కాలువ ద్వారా 6,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు శనివారం తెలిపారు. అలాగే 6,350 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న ఎల్ఎండీకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జలాశయంలో 14.92 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ పనుల సర్వేలు పూర్తి చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 31: ప్రభుత్వ పనులకు సంబంధించిన సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఖీమ్యానాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో ప్రభుత్వ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన సర్వేయర్లు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు స్థానికంగా ఉండాలన్నారు. ప్రభుత్వానికి చెందిన సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, ఇతర వ్యక్తుల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సర్వేయర్ల పనితీరుపై వారం, నెల వారీ నివేదికలు ఇవ్వాలని ఏడీ సర్వే వినయ్ కుమార్‌కు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ డీఐలు బాలచందర్, రత్నం, సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహన

వేములవాడ రూరల్, ఆగస్టు 31: వేములవాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సిరిసిల్ల ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్రావు, రీజనల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇన్‌చార్జి సయ్యం సాయిబాబా సూచించారు. ఇక్కడ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శోభారాణి, శకుంతల, అప్పాని ప్రసాద్, నర్సయ్య, కరుణ, తదితరులు ఉన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

తెలంగాణ చౌక్, ఆగస్టు 31: అనుమతి లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి.. రెండు డీజేలు సీజ్ చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెశనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకంపేట, సిరిసిల్ల పాత బస్టాండ్ ఏరియాలో అనుమతి డీజేలు పెట్టిన పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గణేశ్ మండపాల వద్ద సౌండ్ సిస్టమ్ మాత్రమే వినియోగించాలని, పెద్ద స్పీకర్లతో కూడిన డీజేలు నడిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆలయాల్లో శ్రావణ సందడి

రుద